


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### నిజమైన స్నేహితుడు

**అసలు ఈ స్నేహం** మీద బోలెడు కథలు సినిమాలూ చూసాం. మా వారికి మాత్రం నా స్నేహితులంటే మొదటినుండీ అలుసే. చిన్నప్పుడు సందానీతో నాది ఆపద్దర్మ స్నేహం. ఎందుకంటే వాడు పతంగి ఎగరవెయ్యడం దగ్గరనుంచీ, మేకపాలు తియ్యడం, మురికికాలవలో కర్చీఫ్‌లో చేపలు పట్టడందాకా నేర్పించేవాడు. నాకు గురువూ, మిత్రుడూ, వేదాంతీనూ.

టీచర్ హోం వర్క్ చెయ్యకపోతే స్కేలుతో కొడ్తుందని వాడు ఆ స్కేలు మాయం చేసేవాడు. నాకు ప్రోగ్రెస్ రిపోర్ట్‌లో మార్కులు తక్కువ వస్తే 'నాన్నగా అమ్మగా' అన్నీ అయి ఆదుకునేవాడు 'ఒక్క సంతకం'తో.

ఇంట్లో అమ్మమ్మ మీద పోట్లాడి అలిగి 'నేను అన్నం తినను' అని ఏడుస్తూ ఏ గుడి అరుగు మీదో పడుకుంటే, వాడు గాజర్ దుంపలూ, జామకాయలూ, ఉప్పూకారంతో మామిడి పిందెలూ తెచ్చి ఆకలి తీర్చేవాడు. 'రాజువయ్యా మహరాజువయ్యా' అని బ్యాక్‌గ్రౌండ్ సాంగ్ వేసుకునేదాన్ని.

ఒకనాడు.. మర్నాడు పరీక్ష పేపర్‌లిస్తారు. తక్కువ మార్కులొస్తే హిందీ మాస్టర్ చెమ్డాలు ఎక్కదీస్తానన్నాడు. నేను హిందీలో పూర్. మిగతా వాటిల్లో రిచ్ అని కాదు కానీ గట్టెక్కిపోతాను. అలా అని ఏడుస్తుంటే, పొద్దుటే 'హెడ్‌మాస్టర్' గారు పోయారని కనిపించిన వాడికల్లా చెప్పి, బడి మూయించేసేటంత పని చేసాడు.

పనిమీద హెడ్ మాస్టర్‌గారు ఊరెళ్ళారు. సెలూన్‌లో గెడ్డం గీకించుకుంటున్న వారి అబ్బాయి ఈ వార్త విని 'ఎలాగూ పదోనాడు తలనీలాలతో బాటు, ఇవ్వాలని' గెడ్డం గీకించుకోకుండా వచ్చేసాడుట.

బడికి సెలవు ఇవ్వాలా వద్దా? అని వైస్ ప్రిన్సిపాల్‌తో సహా టీచర్స్ అంతా మీటింగ్ పెట్టారు. హిందీ మాస్టర్ నీల్‌కంఠ శాస్త్రి" రోటీ ఖావ్.. చావల్ మత్ ఖావ్ బోలే మైనే.. సార్ నహీ సునా!" అంటున్నాడు.

ఆంధ్రుల అందరి చావులకీ కారణం 'బియ్యమే' అని తీర్మానిస్తూ. దాంతో నా ప్రాణం, తెరిపిన పడింది. ఈ రోజు హిందీ పండిట్ పరీక్ష పేపర్స్ ఇవ్వడని.

నీలవేణి టీచర్ మాత్రం ముక్కు అంతా ఎర్రబడేట్లు ఏడుస్తూ 'ఈ వార్త నిజం కాకూడదు. కొబ్బరికాయ కొడతాను' అని లక్ష్మీగణపతి గుడిలో మొక్కుకు వొచ్చిందట, మా తెల్ల చిట్టి చెప్పింది. ఈవిడ కెందుకింత బాధా? అంటే ఈవిడకి ప్రిన్సిపాల్ ప్రమోషన్‌కి

రికమెండ్ చేస్తానన్నాడుట. కొత్త ప్రిన్సిపాల్ వస్తే 'గూస్' అంటే గుడ్లగూబా అని చెప్పే ఈవిడ ఆంగ్ల భాషా పరిజ్ఞానానికి ప్రమోషన్ కాదు డిమోషన్ రావడం ఖాయం.

అసలు ఈ లక్ష్మీ గణపతికి మేమూ కొబ్బరికాయలు మొక్కాం, డేవిడ్‌గాడు రాణీ టీచర్‌కి పెళ్ళికాకూడదనీ, సందానీగాడు వాళ్ళ నాన్న సైకిల్ చక్రం తను అమ్ముకున్నానని ఆయనకి తెలీకూడదనీ, నేనేమో సుజాత కన్నా ముందే నేను సంక్రాంతి రోజు ముగ్గులు పెట్టెయ్యాలని. ఆయన చిన్న పిల్లలని పట్టించుకోడు. కొబ్బరికాయలమ్మే నాగయ్య మాత్రం బాగుపడ్తున్నాడు. ఇలా రెండురోజులు గడిచాయి.

హెడ్‌మాస్టర్ గారి కోడలు పాలుపోసే ఆగమయ్యకి ఒకటిన్నర శేరు అక్కర్లేదు. ఒక శేరు పొయ్యి రేపటినుండీ అని చెప్పేసాకా ఆయన పంచెలు వుతికే సాలయ్య, అన్నింట్లోకీ తెల్లనిది తీసి ధైర్యంగా ఆయనింక రాడని కట్టేసుకున్నాక వైస్ ప్రిన్సిపాల్ రంగనాథం సార్, ఆయన రూమ్‌లో ఆయన కుర్చీలో కూర్చుని ఫోన్ చేసి పక్కింటికి, పెళ్ళాంతో అరగంట కబుర్లు చెప్పేసాకా, జ్యోతీ టీచర్ నీలవేణికి ప్రమోషన్ రాదని తెలిసి. రహస్యంగా మా అందరికీ పిప్పరమెంట్లు పంచేసాకా, బడిలో అధికారికంగా కండోలెన్స్ మీటింగ్ పెట్టకముందే, ఆయాలు పాపమ్మా లక్ష్మీ, వాచ్‌మెన్ బహదూర్ మెట్ల మీద ఆయన సంతాప సభ పెట్టేసాకా, పిల్లలు క్లాస్ రూమ్‌లో ఆనందంతో గెంతులేస్తూ, బోర్డ్ మీద ఏనుగుబొమ్మ వేసి, దానికి కళ్ళజోడు పెట్టి, పైన నెహ్రూ టోపీ పెట్టి కింద పంచెకట్టి, "వీ లవ్ యూ సార్" అని రాసేసాకా, వడ్డీవ్యాపారం చేసే సాల్మన్ సార్ ఆయనకి ఎప్పుడెప్పుడెంతెంత అప్పు ఇచ్చాడో తలచుకుని దుఃఖంతో 'ఉన్నావా.. అసలున్నావా?' అన్న ట్రైప్‌లో పాట పాడుకుంటూ వుండగా, పెట్టే బేడాతో హెడ్ మాస్టర్‌గారు దిగడం, అది చూసి బండి దగ్గర రాంలాల్ స్పృహ తప్పిపోవడం జరిగిపోయాయి.

హెడ్‌మాస్టర్‌గారు మండి పడ్తూ ఇంటికెళ్ళారు. ఆయన మూడు నెలలనుండి రాని తన జీతం కోసం డీ.ఈ.ఓ గారి ఆఫీస్ కెళ్తే 'నువ్వు చచ్చిపోయినట్టు మీ బడినుండి ఫోన్ వచ్చింది. ఇప్పుడు జీతం వివరాలు చెప్పలేం. గ్రాట్యుటీ పి.ఎఫ్ త్వరలో పంపిస్తాం' అన్నారట.

కోడలు ఉస్సూరని పాలవాడితో 'శేరున్నరా' అని చెప్పడానికెళ్ళింది. మాసిన గెడ్డంతో వున్న కొడుకు 'నాన్నా ఇంకా బతికే వున్నావా?' అన్నాడు. ఆయన వెంటనే వున్న ఒక్క ఇల్లూ కూతురి పేరు మీదకి మార్చడానికి, అడ్వకేట్ రామారావుగారి దగ్గరకి వెళ్ళాడు.

బడికి శలవిచ్చేసారు పిల్లమూకంతా కలిసి బిలబిలలాడుతూ బయటకి వచ్చేసాకా, నేనూ సందానీ ముక్కుకి రుమాలు కట్టుకుని మురికి కాలవలో చేపలు పడ్తున్నప్పుడు 'రేపు కూడా శలవిస్తే బావుండు. తెనాలి రామకృష్ణ సినిమా కెళ్ళచ్చు బాలాజీ టాకీస్‌లో' అని నేను అంటే, "హెడ్ మాస్టర్ చచ్చిపోయిండని, సర్క్యులర్ పోయిందిగా, అది మారనీకి ఒక్క దినం పడ్తది. హెడ్‌మాస్టర్ బతికున్నా అని చెప్తే మన రంగనాథం సార్ నమ్మనీకి ఒక్క దినాం పడ్తది.." అన్నాడు.

"ఎందుకు నమ్మడూ?" అన్నాను.

"నేను నాకీ నాయినా సచ్చిపోయిందని ఎన్నిసార్లు లెటర్ రాసుకు రాలే.. నమ్మిండా?" అన్నాడు.

"నీ మొహం.. నీ రైటింగ్ అర్ధం కాలేదు అనుకుంట. పైగా అన్నీ తప్పులు. అందుకే నమ్మి ఉండడు" అన్నా.

సందానీ చెప్పు బోర్లించి, కింద వుమ్మి, నా నెత్తిమీద తన చెయ్యి పెట్టి "ఒట్టు పెట్టు. ఈ సంగతి నేనే చెప్పిందని నువ్వు ఎవరికీ చెప్పకూడదు. తెలిస్తే మనని ఇద్దరినీ పోలీస్‌లు పట్టుకుపోతాయ్" అని బెదిరించాడు.

"పోలీసులు పట్టుకుపోతే ఎలా? నేను తెనాలి రామకృష్ణ సినిమా చూడాలి. చెప్పనులే అయినా ఇంతమందికి ఈ అబద్ధం ఎలా చెప్పి నమ్మించావ్?" అని అడిగా.

"నేను నాదీ అమ్మకీ, అమ్మీజాన్ పక్క ఇంట్లో పంకజం ఆంటీకీ చెప్పింది. తరువాత ఆంటీ మొగుడు సెలూన్ల.. సెలూన్‌ల విన్నోళ్ళు, ఇంట్ల పిల్లలకీ, తర్వాత టీచర్‌లకీ మొత్తం గంటల సర్క్యులర్ వచ్చేసింది. సర్క్యులర్ నేనూ రాంచంద్‌గాడూ కలిసి పెన్‌తో రాసి, బోర్డ్‌ల 'లటకాయించినం' అని కిసుక్కున నవ్వాడు. "మరి రంగనాథం సార్ సైనో?" అమాయకంగా అడిగాను.

"ఆయన ఇంటికి ఫోన్ చేసినప్పుడు ముందు పెట్టించినా పాపమ్మ చేత.. పాపమ్మకి ఉప్పుచేపలిచ్చినా. దాంతో ఆయన ఫోన్ల 'లంచ్‌కి గుమ్మడికాయ పులుసు చెయ్యి' అనుకుంట, లటలట సంతకం చేసినయ్" అని మొత్తం కథ చెప్పాడు.

దాంతో నేను కళ్ళింత చేసి చూసి "సరే సందానీ.. ఇదంతా హిందీ పండిట్ నన్ను కొట్టకూడదని చేసావు కదూ? ఎందుకురా నేనంటే నీకింత పిచ్చి?" అని దేవదాసులో పార్వతిలా అడుగుతుంటే "తుత్.. నీకోసం కాదు.. నిన్న నేనూ డేవిడ్‌గాడూ, రమేష్ కలిసి బడిలో గంట ఎత్తుకుపోయి అమ్మేసుకున్నాం ఇరానీ హోటల్ల సమోసా తిని చాయ్ తాగనీకి హెడ్‌మాస్టర్‌కి తెలిస్తే నాదీ, వాళ్ళదీ తోలు తీసి డోలు కడ్తయ్. అందుకే నువ్వు అడగగానే ఈ అవిడియా ఏసినా" అన్నాడు.

"ఓరి దొంగ వెధవా! ఇంకా నామీద స్నేహంతో అనుకున్నా కదరా, 'ఏ దోసితీ... హమ్ నహీ చోడితీ' అని పాడుకున్నా కూడా." అని వాడిని తిట్టేసి లేచి వచ్చేస్తుంటే "ఒట్టు పెట్టినవ్ ఎవులికైన చెప్తే నీకి అమ్మమ్మ సచ్చిపోతయ్" అన్నాడు.

వాడు అమ్మమ్మ అని ఎందుకన్నాడంటే, మనకి ఇంట్లో ఫైనాన్షియల్ సోర్స్ ఆవిడే రేపు సినిమా చూడాలంటే ఎల్లుండి వాడు ఈ మాట అంటే సినిమా చూసేసాకా నేను ఖాతరు చేసేదాన్నికాదు. అందుకే వీక్ పాయింట్ మీద కొట్టాడు.

ఈ సందట్లో హెడ్ మాస్టర్‌గారింట్లో చాలా పెద్దపెద్ద గొడవలే జరిగాయి. ఆయన కూతురి పేరుమీద ఇల్లు పెట్టాలని లాయర్ రామారావుగారింటికెళ్ళాడని తెలిసి, అల్లుడు ఫ్రెండ్స్‌కి పార్టీ ప్రామిస్ చేసేసాడు. కొడుకు 'అంతా సెలూన్లో బ్లేడ్ బాబ్జీ వల్లే' అని తండ్రి కాళ్ళమీద పడ్డాడు. బాబ్జీ మాత్రం 'నాకేటి తెలుసండీ? వారి కోడలుగారు మావగారు లేరు టీ ఖర్చు తప్పిందని ఆగమయ్యకి అర్ధశేరు పాలు తగ్గించమంటేనూ" అన్నాడు.

ఆగమయ్య పంకజం మొగుడు శేషప్ప చెప్పాడనీనూ, శేషప్ప పంకజం చెప్పిందనీనూ, పంకజం బూబమ్మ చెప్పిందనీనూ, సందానీ తల్లి 'నాకీ బేటా...' అని ఆగిపోయింది. ఆవిడకి విషయం అంతా తేటతెల్లం అయి, "బడిల అనుకుంటుంటే విన్నా సారూ!" అంది.

ఈలోగా ఈ వార్త తెలిసి సందానీ తండ్రి వాడి మూడు నెలల జీతం కట్టమని పెళ్ళాం ఇస్తే, "హెడ్ మాస్టర్ పోయాడుగా. ఇప్పుడిప్పుడే బడి తెరవరని అది కల్లుపాకలో పాత బాకీ కట్టి తాగేసాడుట"

పాపమ్మ సర్క్యులర్‌నీ, రంగనాధం సార్ సైన్స్‌నీ, నీలవేణి టీచర్ మొక్కునీ, నీలకంఠ్ శాస్త్రి ఆనందాన్నీ అన్నీ హెడ్ మాస్టర్‌గారు కోర్ట్ మార్షల్ చేసి, 'గంట' దొంగతనం దగ్గరకొచ్చి, డేవిడ్‌నీ, రమేష్‌నీ పట్టుకుని సందానీ కోసం చూస్తే, వీడు కాలవలో చేపలు పడ్తూ "నాకీ బడికి ఫీజే కట్టలేదు నాకీ నాయిన. బడికెట్ల వస్తాయ్.. రాను!" అన్నాడు.

ఫీజు కట్టని వాడికి బడికి పిలిచి డిసిప్లిన్ పాడు చెయ్యడం ఇష్టంలేక హెడ్ మాస్టర్ విచారణ వాయిదా వేసి, డీ.ఈ.ఓ ఆఫీస్‌కి 'నేను బతికే వున్నాను. ప్రూఫ్స్ కావాలంటే నేను ఈ నెల కట్టిన కరెంట్ బిల్లు, నా బ్లడ్ తీసిన రిపోర్ట్ ఇవాళ గెడ్డం చేసిన మంగలీ' అంటూ అవి సమకూర్చుకోడంలో పడ్డాడు. నీలవేణి టీచర్ కొబ్బరికాయ కొట్టి, పంచదార కలిపి ఆ ముక్కలు మా అందరికీ పెట్టింది.


అమ్మమ్మ తెనాలి రామకృష్ణ సినిమాకి డబ్బులిచ్చాకా, నేనూ తెల్ల చిట్టీ మంజూ, భవానీ సినిమా చూసొచ్చి "మనలాగే అవసరార్ధం రామకృష్ణ కూడా అబద్ధాలు చెపితే, పుస్తకాలలో రాసి సినిమాలు తీసారు మనం అవసరార్ధం చిన్న అబద్ధం ఆడ్తే చెమ్డాలు ఎక్కతీస్తారీ పెద్దాళ్ళు" అని విచారించాం.


సందానీ మాత్రం నేను తీసుకెళ్ళిన కొబ్బరి ముక్కలు తింటూ 'ప్రధాని మంత్రి సచ్చిపోతే కమ్ సే కమ్ వారం దినాలు శలవు ఇస్తరు ఏ.వీ రమణీ!' అన్నాడు.

నాకు భయం వేసింది. వీడు తలుచుకుంటే ప్రధానమంత్రిని కూడా చంపేయగలడని "ఒద్దురా జెండా వందనం వస్తోంది ఎలాగూ మనం నాటకం ప్రాక్టీసులో వుంటాం. క్లాసులకి వెళ్ళక్కర్లేదు" అని అప్పటికి వూర్కో పెట్టా! ఏమైనా వాడూ స్నేహితుడంటేనూ కాదంటారా?



Post your comments


కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి
కాలమ్ దాటని కబుర్లు
బలభద్రపాత్రుని రమణి


కాలమ్ దాటని కబుర్లు-II
బలభద్రపాత్రుని రమణి